ప్రజాశక్తి
ఆదివారం 11 మే 2025 5
అనంతపురం

వీరజవాను పార్థివదేహాన్ని కళ్లితండాకు తీసుకువస్తున్న వాహనం

చి'వరి'కి ఎదురు చూపే..!

పంట కొనేవారు లేక రైతుల అవస్థలు
20 రోజులుగా కల్లాల్లోనే వరిపంట
అరకొరగా చేతికొచ్చిన పంటను కొనే వారు కరువు

కొనుగోలు దారులు రాకపోవటంతో పొలంలో నిల్వ ఉంచి వరిధాన్యం

పొలంలోనే నిల్వ ఉంచిన వరిధాన్యం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఆరుగాలం పంట సాగు చేసిన రైతుకు చి'వరి'లోనూ కష్టాలు తప్పడం లేదు. కోత కోసి కుప్పలుగా సిద్ధంగా ఉంచిన పంటను కొనేవారి కోసం రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాల్ మండలంలో వరి రైతులు గత 20 రోజులుగా వ్యాపారుల కోసం ఎదురుచూస్తున్నారు. బొమ్మనహాల్ మండంలోని పలు గ్రామాల్లో బోరుబావుల కింద రైతులు వరి పంటను సాగు చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షంతో వరిపంట పెద్ద ఎత్తున నేలవాలింది. అకాల వర్షాన్ని తట్టుకుని చేతికొచ్చిన అరాకొర పంటను కొనేవారు లేక రైతులు వ్యాపారులు, ప్రభుత్వంపై ఆశగా ఎదురు చూస్తున్నారు. మండల పరిధిలోని లింగదహాల్, కలగాలని, గోనేహాళ్, శ్రీధర్‌గట్ట, బండూరు, బొమ్మనహాల్, ఉప్పరహాల్, కృష్ణాపురం, గోవింద వాడ, గౌనూరు గ్రామాల్లో వరి పంటను కోత కోసి కుప్పలు వేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఒక ఎకరాకు 20 కింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా అకాల వర్షాలు, తెగుళ్లతో 5 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. ఉన్న అరకొర పంటను కూడా కొనే వారు లేక గత 20 రోజులుగా వరి ధాన్యాన్ని కల్లాల్లో వేసుకుని దానికి కాపలాగా అక్కడే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం వస్తే ధాన్యం కుప్పలను కప్పుకునేందుకు రైతులకు అవస్థలు తప్పడం లేదు. గతేడాది ప్రభుత్వం క్వింటా రూ.2250తో కొనుగోలు చేసింది. ప్రస్తుతం రూ.1500, నుంచి రూ.1800కు మించి వ్యాపారులు అడగడం లేదు. ఈ ధరతో పంటను విక్రయిస్తే పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి ఉంటుంది. బొమ్మనహాల్ మండలంలో స్థానికంగా మార్కెట్‌యార్డు లేకపోవడంతో పంట నిల్వకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కర్నాటక నుంచి కొందరు వ్యాపారులు పంటను కొనేందుకు వస్తున్నా వారు అప్పు అడుగుతున్నారు. గతంలో ఇలా కర్నాటక నుంచి వచ్చిన వ్యాపారులు అప్పుగా పంటను తీసుకెళ్లి తర్వాత డబ్బులు ఇవ్వకుండా ఐపి పెట్టిన ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇలాంటి వారికి పంటను అమ్మేందుకు రైతులు భయపడుతున్నారు. స్థానికంగానే వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని గతంలో రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. అయితే ఆ హామీ నేటికీ నెరవేరలేదు.

ప్రభుత్వమే పంటను కొనాలి

గత జనవరిలో క్వింటా రూ.2250తో వరి అమ్ముడుపోయింది. ప్రస్తుతం ఈ ధర అటుంచి కనీసం కొనేందుకు వ్యాపారులెవరూ ముందుకు రావడం లేదు. తక్కువ ధరతో ఉన్న కాస్త పంటను కొనుగోలు చేసేందుకు దళారులు వస్తున్నారు. వీరికి పంటను అమ్మితే పెట్టుబడులు కూడా చేతికిరావు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధరతో పంటను కొనుగోలు చేయాలి

గొల్ల లింగన్న,
లింగదహాళ్ గ్రామం.

కొనేవారి కోసం ఎదురుచూస్తున్నాం..

ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. డీఏపీ, యూరియా కాంప్లెక్స్ ఎరువులను ప్రతి సంవత్సరం పెంచుతూ పోతున్నారు. పంటలకు మాత్రం కనీస మద్దతు ధర ఇవ్వడం లేదు. ధరలు లేక పెట్టుబడులు కూడా చేతికందలేదు. ప్రస్తుతం వరి పంటను అమ్మకానికి సిద్ధంగా ఉంచినా కొనేవారు లేరు. కళ్లాల్లో పంటను వేసుకుని వ్యాపారుల కోసం ఎదురు చూస్తున్నాం.

బోయ వన్నూరప్ప,
లింగదహాల్ గ్రామం.

డీఎస్సీ ప్రిపరేషన్‌కు గడువు పెంచాలి

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎ.గేయనంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

డీఎస్సీ పరీక్ష ప్రిపరేషన్ కోసం 90 రోజులు సమయం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎ.గేయానంద్ డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని 2వరోడ్డు వద్ద ఉన్న స్టడీ పార్క్‌లో డీఎస్సీ అభ్యర్థులతో మాజీ ఎమ్మెల్సీ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన సమస్యలపై ఆయన మీడియాతో మాట్లాడుతూ అనేక పోరాటాలు ధర్నాలు.. అరెస్టుల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం 7 సంవత్సరాల తర్వాత 16,347 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. దీన్ని పీడీఎఫ్ ఫోరమ్, డివైఎఫ్ఐగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. డీఎస్సీకి గత 7 సంవత్సరాల నుంచి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు అనేక సమస్యలు ఈ నోటిఫికేషన్‌లో కనిపిస్తున్నాయని తెలిపారు. కావున సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ పరీక్షల సమయం పెంపునకు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించి డీఎస్సీ అభ్యర్థులకు అండగా నిలవాలన్నారు. ప్రధానంగా జిల్లాకు ఎస్‌జిటి పోస్టులు సంఖ్య పెంచాలన్నారు. ఒకే జిల్లా – ఒకే పరీక్ష పేపర్ ఉండాలన్నారు. హెవీ సిలబస్ ఉన్నందువల్ల ప్రిపేర్ అవ్వడానికి 90 రోజులకు సమయాన్ని పొడిగించాలని కోరారు. వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీలో 40 శాతానికి తగ్గించాలన్నారు. బీఈడీ, టెట్, డైట్‌లో 40 శాతం ఇచ్చారుగానీ, డీఎస్సీలో 45 శాతం అంటే ఇప్పుడు వారు ఎలిజిబుల్ కావడం లేదన్నారు. బ్యాక్‌లాక్ పోస్టులు 2024 డీఎస్సీ నోటిఫికేషన్ ఉన్నవి ప్రస్తుత డీఎస్సీలో పెట్టలేదని వాటిని కూడా పెట్టాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్, జిల్లా అధ్యక్షుడు బాలక్రిష్ణ, డీఎస్సీ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

మాంఛూఫెర్రర్‌తో మాట్లాడుతున్న మంత్రులు

మాంఛూఫెర్రర్‌ను కలిసిన మంత్రులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఆర్డీటీ కార్యాలయంలో ఆర్‌డిటి డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్‌ను మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్‌యాదవ్ శనివారం కలిశారు. ఇందులో భాగంగా ఎఫ్‌సిఆర్ఎ పునరుద్ధరణకు ఎదురవుతున్న సమస్యలపై చరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఎఫ్‌సిఆర్ఎ పునరుద్ధరణ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సిఎం హోదాలో అసత్య ప్రచారం తగదు

ఉరవకొండ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా హంద్రీనీవాపై అసత్య ప్రచారాలు గుప్పించడం తగదని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. గత వైసిపి ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హంద్రీనీవా సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులకు పెంచుతూ నిర్ణయం తీసుకుని టెండర్లు కూడా పిలిచారన్నారు. ఇందులో భాగంగానే జీడిపల్లి రిజర్వాయర్ డౌన్ స్ట్రీమ్ 4 టిఎంసిలు అదనంగా నిల్వ చేయడానికి వీలుగా రూ.675 కోట్లతో ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేయించారని గుర్తు చేశారు. దాన్ని ప్రస్తుత కేటాయింపుల్లో ఆమోదిస్తే రాయలసీమకు తాగునీరు, సాగునీరు అవసరాలకు నీరు అందించ డానికి వీలుంటుందన్నారు. జిల్లాపై అపారమైన ప్రేమ ఉందని కబుర్లు చెప్పే మీరు అనంతపురానికి మంజూరైన ఎయిమ్స్‌ను మంగళగిరికి ఎందుకు తరలించాని ప్రశ్నించారు. అభివృద్ధి అంటే ఒక్క రాజధాని అమరావతి ఒక్కటే కాదని, రాష్ట్రమంతా అభివృద్ధి జరిగితేనే అభివృద్ధి అంటారన్నారు.

బెంగుళూరు విమానాశ్రయంలో మురళీనాయక్ పార్థివదేహం వద్ద మంత్రి సవిత

మురళీనాయక్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

స్వగ్రామానికి మురళీ నాయక్ పార్థివ దేహం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పాక్ కాల్పుల్లో వీర మరణం పొందిన మురళీ నాయక్ పార్థివ దేహం శనివారం రాత్రికి స్వగ్రామమైన కల్లితండాకు చేరుకుంది. పార్థివ దేహం బెంగళూరు విమానాశ్రయం చేరుకోగానే అక్కడ సైన్యం గౌరవ వందనం స్వీకరించిన తరువాత అధికారిక లాంఛనలతో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ అధికారులతో కలసి తీసుకున్నారు. అక్కడి నుంచి పార్థవదేహాన్ని రోడ్డు మార్గంలో గోరంట్ల మండలం కల్లితండాకు తీసుకొచ్చారు. నేడు అంత్యక్రియలు జరగనున్నాయి. మురళీ నాయక్ పార్థివ దేహాన్ని సందర్శించేందుకు పెద్దఎత్తున సందర్శకులు వచ్చే అవకాశమున్నందున కల్లితండాలో భారీ ఏర్పాట్లను అధికారులు చేపడుతున్నారు. ప్రముఖులు కూడా అంత్యక్రియలకు హాజరయ్యే అవకాశముండటంతో గ్రామంలో రహదారుల విస్తరణతోపాటు, పారిశుధ్యం తదితర పనులను పంచాయతీ సిబ్బంది చేపట్టారు.

పెద్దఎత్తున కొనసాగిన పరామర్శలు

మురళీ నాయక్ కుటుంబాన్ని మహారాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఉదయ్ సంపత్ పరామర్శించి మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ సిండేతో వీడియో కాల్‌లో మాట్లాడించారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శించి రెండు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు , కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, హిందూపురం ఎంపి బికె.పార్థసారధి, ప్రముఖ సింగర్ మంగ్లి పరామర్శించిన వారిలోనున్నారు.

అంత్యక్రియలు హాజరుకానున్న ప్రముఖులు

మురళీ నాయక్ అంత్యక్రియలకు పెద్దఎత్తున ప్రముఖులు హాజరవనున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి , రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లతోపాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు ఈ నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

నేడు అంత్యక్రియలు

ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు సామాన్య ప్రజల సందర్శనార్థనం మురళీనాయక్ పార్థవదేహాన్ని ఉంచుతారు. ఎనిమిది నుంచి తొమ్మిది గంటల వరకు కుటుంబ సభ్యులు అంత్యక్రియ ఏర్పాట్లు చూస్తారు. ఉదయం 9 గంటల నుంచి 9.30 గంటల వరకు మిలిటరీ శర్మనీ ఉంటుంది. ఉదయం 9.30 గంటల నుంచి 10 గంటల వరకు ప్రముఖుల సందర్శనార్థం సమయమిస్తారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య అంతిమయాత్ర ప్రారంభమవుతుంది. 11 గంటల నుంచి 11.30 మధ్య ప్రముఖుల నివాళులు ఉంటాయి. 11.30 గంటల నుంచి 12 గంటల మధ్య పోలీసు, మిలటరీ గన్ సెల్యుట్ పూర్తవుతుంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 గంటల మధ్య మిలటరీ అధికారులు కుటుంబ సభ్యులకు జాతీయ పతాకాన్ని అందజేస్తారు. 12.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య అంత్యక్రియలు పూర్తవుతాయి.

కళ్లితండాలో వీరజవాను పార్థివదేహం చూసేందుకు వచ్చిన జనం

నేడు వీరజవాను అంత్యక్రియలు

భారీ ఎత్తున ఏర్పాట్లు

కుటుంబసభ్యులకు ప్రముఖుల పరామర్శ

పుట్టపర్తి రూరల్ : భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ అంత్యక్రియలకు రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, పవన్ కళ్యాణ్, వంగలపూడి అనిత హాజరుకానున్నారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని కళ్లి తాండ స్వగ్రామానికి మురళి నాయక్ భౌతికకాయం శనివారానికి చేరుకుంది. ఈసందర్భంగా గుమ్మయ్యగారిపల్లి నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు . పాక్ జరిపిన కాల్పుల్లో మరణించిన నేపథ్యంలో అధికారిక, సైనిక లాంఛనాలతో జరిగే అంత్యక్రియలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు హోంమంత్రి అనిత హాజరై మురళీ నాయక్ పార్థివదేహానికి నివాళి అర్పించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి.రత్న ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు ఈ సందర్భంగా పటిష్ట మైన పోలీస్ భద్రత ఏర్పాట్లు సిద్ధం చేశారు.

గోరంట్ల : దేశ సరిహద్దు లో పాకిస్తాన్ ఇండియా మధ్య జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందిన సైనికుడు మురళి నాయక్ పార్థవ దేహం శనివారం రాత్రి స్వగ్రామమైన కళ్లి తండాకు మిలటరీ వాహనంలోచేరుకుంది వీర జవాన్ పార్థవ దేహం చూడడానికి సాయంత్రం నాలుగు గంటల నుండి గుమ్మయగారిపల్లి సర్కిల్లో వేలాదిమంది ప్రజలు తరలివచ్చి వీర జవాన్ కు జై భారత్ అంటూ మురళి నాయక్ పార్థ దేహానికి నివాళులర్పించారు బెంగళూరు ఎయిర్ పోర్ట్ నుండి రోడ్డు మార్గాన చిక్బల్లాపూర్ మీదుగా పాలసముద్రం సర్కిల్ నుండి గోరంట్లకు జవాను పార్థవ దేహం తీసుకొచ్చారు బెంగుళూరు ఎయిర్ పోర్టు నుంచి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత. ఎమ్మెల్యే పరిటాల సునీత తదితరులు సైనికుడి పార్థివదేహాన్ని తీసుకొస్తున్న మిలిటరీ వాహనం వెంట వచ్చారు వీరు తల్లితండాకు చేరుకొని జవాన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మురళి నాయక్ పార్థవదేహం చూడడానికి వేలాదిమంది రావడంతో గుమ్మయగారిపల్లి సర్కిల్‌లో ట్రాఫిక్ జామ్ కావడంతో వేలాది వాహనాలు నిలిచిపోయాయి. జిల్లా ఎస్పీ రత్న పర్యవేక్షించి ట్రాఫిక్‌ను నియంత్రించారు మురళి నాయక్ అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో జరుగునున్నట్లు అధికారులు తెలిపారు

పార్థివదేహం తీసుకువస్తున్న వాహనం ముందు జాతీయ జెండాతో మంత్రి సవిత,

రాజకీయ వేడి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేసవి తరహాలోనే రాజకీయ వేడి కూడా పెరిగింది. ఒక వైపు వైసిపి నాయకుల అరెస్టులు, ఆరోపణలపై పోలీసుల చర్యలు కొనసాగాయి. మరోవైపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ వారంలో అనంతపురం జిల్లాలో పర్యటించారు. సత్యసాయి జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాపిరెడ్డిపల్లి పర్యటన సందర్భంగా జరిగిన ఘటనపై వైసిపి నాయకులపై కేసులు నమోదయిన విషయం తెలిసిందే. ఈకేసుల్లో వైసిపి నాయకులను ఈ వారంలో అరెస్టు చేశారు. అదే సందర్భంలో హెలికాప్టర్ పైలెట్‌కు నోటీసులిచ్చారు. అయితే ఆయన విచారణకు హాజరుకాకపోవడంతో మరోమారు నోటీసులిచ్చారు. ఆ విచారణ కొనసాగుతున్న క్రమంలోనే వైసిపి నాయకులపైనా చర్యలు కొనసాగుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. అయితే ఆయన న్యాయస్థానం ఆశ్రయించారు. 41 సి నోటీసుల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించడంతో ఆయన అజ్ఞాతం వీడాడు. ఇక తాడిపత్రి నియోజకవర్గం రాజకీయ మరింత వేడెక్కింది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలో ప్రవేశించడానికి అనుమతినివ్వాలని కోర్టును ఆశ్రయించారు. కోర్టు అనుమతినివ్వడంతో ఆయన తాడిపత్రికి వెలుతారన్న విషయం తెలియగానే మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి అడ్డుకుంటామని చెప్పడం ఉద్రిక్తతలకు దారి తీసింది. జిల్లా ఎస్పీని కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి కలసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబున పర్యటన తరువాత తగిన భద్రతతో తాడిపత్రికి అనుమతిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసిన తరువాత ఇప్పుడు ఏమి జరుగుతుందోనన్న ఆసక్తి నెలకొంది. ఇద్దరి మధ్య పోరులో తాడిపత్రి రాజకీయం మరింతగా వేడెక్కింది. ఈ రకంగా ఈ వారంలో అధికార , ప్రతిపక్ష వైసిపి మధ్య పోరు నడిచి రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన ఉరవకొండ నియోజకవర్గంలో వజ్రకరూరు మండలంలోని ఛాయపురంలో జరిగింది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను ఆయన పరిశీలించారు. వచ్చే 50 నెలల్లో ఈ వెడల్పు పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. జులై 10వ తేదీన వచ్చి ప్రారంభోత్సవం చేపడతామని తెలిపారు. అదే సందర్భంలో హంద్రీనీవా నుంచి చెరువులకు అనుసంధానం చేసి నీటితో నింపే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది ఒకింత జిల్లాకు మంచి జరిగే విధంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన మురళీ నాయక్ పాక్‌తో జరుగుతున్న ఉద్రిక్తతల్లో మృతి చెందారు. అగ్నిపథ్‌లో ఎంపికైన మురళీ నాయక్ మృతి చెందడం అందరినీ విస్మయానికి గురిచేసింది. భౌతికకాయం శనివారం స్వగ్రామానికి చేరింది. ఇక ఆర్డీటీకి ఎఫ్ఆర్‌సిఎ అనుమతి కోసం ఈ వారంలోనూ పెద్దఎత్తున పోరాటాలు సాగాయి. కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ముఖ్య నేతలు కూడా మాంఛూఫెర్రర్‌ను కలసి అనుమతి కోసం ప్రయత్నం చేస్తామని హామీనిచ్చారు.

బత్తలపల్లి వద్ద రోడ్డు ప్రమాదం

కారు అదుపు తప్పి బోల్తా... తండ్రి, కుమారుడు మృతి
మరో ఎనిమిది మందికి గాయాలు

ప్రజాశక్తి బత్తలపల్లి

బత్తలపల్లి అవుటర్‌రింగ్‌రోడ్డు వై జంక్షన్ వద్ద శనివారం ఉదయం అనంతపురం వైపు నుండి కదిరి వైపు వెళుతున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న పదిమందిలో తండ్రి కుమారుడు మృతి చెందారు. ఎనిమిది మంది గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదానికి సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాల మేరకు కళ్యాణదుర్గం టౌన్ చెందిన గాజుల రామ్మోహన్ (సాఫ్ట్వేర్ ఉద్యోగి) తన కుటుంబ సభ్యులు, అతని స్నేహితులు రాజశేఖర్ రెడ్డి(45)వారి కుటుంబ సభ్యులు, ముకుందాపురం గ్రామానికి చెందిన ప్రశాంత్‌తోకలసికళ్యాణదుర్గం నుండి తిరుమల వెంకటేశ్వర స్వామి దైవదర్శనం కోసం శనివారం ఉదయం బయలు దేరారు. బత్తలపల్లి సమీపంలోని వై జంక్షన్‌కు కొద్ది దూరంలో వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో నడుపుతున్న రామ్మోహన్, కారులో ఉన్న రామ్మోహన్ భార్య మాధవి, వీరి కుమార్తెలు సాన్విక, జశ్విత,కౌటిల్ కుమార్, స్నేహితుడు రాజశేఖర్ రెడ్డి, ఆయన భార్య దీపిక, కుమారుడు యస్విత్ రెడ్డి, కుమార్తె వీరాధ్య, మరో స్నేహితుడు ప్రశాంత్‌కుమార్ గాయపడ్డారు. తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి పోయారు. రోడ్డుపై వెళ్లేవారు, స్థానికులు అందించిన సమాచారం మేరకు బత్తలపల్లి పోలీసులు 108 సిబ్బంది సహాయంతో క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాజశేఖర్ రెడ్డి (47), అతని కుమారుడు యశ్విత్ రెడ్డి (7) మతి చెందారు. ప్రశాంత్ కుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. మిగిలిన వారు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడు రాజశేఖర్ రెడ్డి భార్య దీపిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బత్తలపల్లి ఎస్ఐ రమేష్ తెలిపారు.

బోల్తాపడిన వాహనం

క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

పిఎం కిసాన్‌కు సంబంధం లేకుండా 'అన్నదాత సుఖీభవ' ఇవ్వాలి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పిఎం కిసాన్ సన్మాన్ నిధికి సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం ఒకేసారి రూ.20 వేలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రైతుసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ 10 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచాలన్నారు. జిల్లాలో గత ఖరీఫ్ రబీలో అతివృష్టి అనావృష్టి వలన పంటలు నష్టపోయామని, పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతులు అప్పుల్లో కూరుకుపోయారని తెలిపారు. దిక్కుతోచని పరిస్థితిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. పండిన కొద్ది పంటలు కూడా మిరప, పత్తి, చీనీ, పొగాకు, పప్పు శనగ, రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చిన అమలు చేయకుండా పంటలు కొనుగోలు చేయకుండా ఏవిధంగా రాష్ట్రంలో జిల్లాను మూడవ స్థానంలో నిలుపుతారని ప్రశ్నించారు. ఎన్నికల ముందు పెట్టుబడి ఖర్చుల తగ్గిస్తామని రైతులకు భరోసా కల్పిస్తామని అన్నదాత సుఖీభవ ద్వారా పెట్టుబడి సాయం రైతుకు రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి సూపర్ సిక్స్‌లో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించారని వాటి ఊసే లేదన్నారు. కానీ జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు పీఎం కిసాన్‌తో కలిపి రైతులకు పెట్టుబడి సాయం మూడు విడతల్లో ఇస్తామని చెప్పడం రైతులను అన్యాయం చేయడమే అవుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం చేసిన మోసం ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే పద్ధతుల్లోనే రైతులకు అన్యాయం చేయడం సరైంది కాదన్నారు. కావున మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సన్మాన్ నిధితో సంబంధం లేకుండా రూ.20వేలు ఒకేసారి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సంజీవరెడ్డి, వన్నూరప్ప పాల్గొన్నారు.

చంద్రబాబూ..చరిత్రను వక్రీకరించొద్దు

వైసిపి హయాంలో రూ.4647 కోట్లతో టెండర్లు పూర్తి -వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

'ముఖ్యమంత్రి చంద్రబాబూ.. హంద్రీనీవా విషయంలో చరిత్రను వక్రీకరించొద్దు..' అంటూ వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హితవు పలికారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం నిర్వహించారు. ముందుగా యుద్ధభూమిలో వీరమరణం పొందిన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో హంద్రీనీవాను శంకుస్థాపనలకే పరిమితం చేయగా వైఎస్ వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాకే పనులను పరుగులు పెట్టించారని గుర్తు చేశారు. దాని ఫలితంగానే 2012 నుంచి జిల్లాకు హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలు వస్తున్నాయన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితమంతా అపద్ధాలతోనే గడుపుతున్నారన్నారు. చేయని పనులను కూడా తానే చేసినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు హంద్రీనీవాకు గంపెడు మట్టి కూడా వేయలేదని చెప్పుకోవడానికే వాళ్ల పరిమితం అయ్యారు. చంద్రబాబు పాలనలోనే హంద్రీనీవా పూర్తి చేప్పుకోవడం బాధాకరమన్నారు. వాస్తవానికి చంద్రబాబు చేసిన ద్రోహం వల్లే హంద్రీనీవా ఆలస్యమైందన్నారు. చంద్రబాబు 1996లో శంకుస్థాపన చేసిన తర్వాత పనులు పూర్తి చేసి ఉంటే ఈ రోజు నికరజలాలు అందేవన్నారు. కానీ, నేటికీ మిగులు జలాలపై హంద్రీనీవా ఆధారపడిందంటే అది చంద్రబాబు నిర్లక్ష్యమే అన్నారు. రాయలసీమకు చంద్రబాబు ద్రోహం చేసి వాటిని దాచిపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. 2014 నుంచి 2019 వరకు సీఎంగా చంద్రబాబు ఉన్నప్పుడు కూడా హంద్రీనీవాను పట్టించుకోలేదన్నారు. వైసిపి హయాంలో రూ.4647 కోట్లతో టెండర్లు కూడా పూర్తయ్యాయని, అయితే 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ టెండర్లను రద్దు చేసి 3850 క్యూసెక్కులకే హంద్రీనీవా విస్తరణ పనులు చేపట్టేందుకు పూనుకోవడం బాధాకరమన్నారు. గత ఎన్నికల సమయంలో హంద్రీనీవా సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి నేడు రాయలసీమకు ద్రోహం చేస్తున్నారన్నారు. 3850 క్యూసెక్కులతో జీడిపల్లికి నీరు రావాల్సి ఉంటే సాంకేతిక కారణాలతో నేడు 2200 క్యూసెక్కులే వస్తున్నాయన్నారు. రెండో దశలో జీడిపల్లి నుంచి 1200 క్యూసెక్కులే వస్తున్నాయన్నారు. అంతేగాకుండా అక్కడ లైనింగ్ చేయడం రైతాంగాన్ని ద్రోహం చేసినట్లే అనంతపురం, చిత్తూరు జిల్లాలకు కష్ణా జలాలు, హంద్రీనీవానే ఆధారం అనే విషయాన్ని మర్చిపోవదన్నారు. జిల్లాకు కియా వచ్చిందంటే గొల్లపల్లి రిజర్వాయర్ వల్లే అంటున్నారని, మరి భవిష్యత్‌లో ఎక్కువ పరిశ్రమలు రావాలంటే నీరు ఎలా తెస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా తమపై విమర్శలు మానుకుని జిల్లా భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని హంద్రీనీవా సామర్థ్యంను 10 వేల క్యూసెక్కులకు పెంచాలని డిమాండ్ చేశారు.

ఇండస్ట్రియల్ పార్కుగా కళ్యాణదుర్గం

ఎమ్మెల్యే సురేంద్రబాబు

వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

విరివిగా పరిశ్రమలు తీసుకొచ్చి కళ్యాణదుర్గం ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ పార్కుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. మండలంలోని మండలం తిమ్మసముద్రం వద్ద ఉన్న ఎపిఐఐసి భూముల్లో ఎంఎస్ఎంఇ పార్కు నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ముందుగా యుద్ధంలో వీరమరణం పొందిన వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలోని ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామికవేత్తలను తయారు చేయాలన్న ఉద్దేశ్యంతోనే ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగమే తిమ్మసముద్రం వద్ద మొదటి ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు కోసం 50 ఎకరాల భూములను కేటాయించినట్లు తెలిపారు. ఇందులో మౌలిక సదుపాయల కల్పన కోసం ఇప్పటికే రూ.7కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే కళ్యాణదుర్గం ప్రాంతానికి రాష్ట్ర ప్రభుత్వం టమోటా, మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు రూ.20కోట్లతో మంజూరయ్యాయన్నారు. ఇలాంటి అవకాశాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుని చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సువాన సోని, ఆస్ట్రో బేస్ స్పేస్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ దేవకుమార్, ఆర్డీఓ వసంత్‌బాబు, నాయకులు మోరెపల్లి మల్లికార్జున, కర్లకుంట రామాంజనేయులు, గోళ్ల లక్ష్మీదేవి రమేష్, వైపీ రమేష్, గోళ్ల వెంకటేషులు, శివన్న, టీఆర్ తిప్పేస్వామి, పాలబండ్ల శ్రీరాములు, శర్మాస్, అమిలినేని లక్ష్మీనారాయణ, జడ్పీటీసీ ప్రభావతమ్మ, మల్లిపల్లి నారాయణ, కోనంకి రాజశేఖర్, కుబేర్ యాదవ్, డీకే రామాంజనేయులు, కొల్లాపురప్ప, గౌని శ్రీనివాసులురెడ్డి, దండా వెంకటేషులు, గాజుల శ్రీరాములు, గురుప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు కుమార్, తిమ్మరాజు, సురేంద్ర, నగేష్ యాదవ్, కామక్కపల్లి నాగరాజు, చంద్రమోహన్, షామీర్, రామ్మోహన్ యాదవ్, తలారి సత్తి, ఊటంకి రామాంజనేయులు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌విజిఎం ప్రిన్సిపల్‌గా పి.హర్షలత

బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రిన్సిపల్ హర్షలత

కళ్యాణదుర్గం రూరల్ : ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పి.హర్షలత శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈమె అన్నమయ్య జిల్లాలోని రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా హర్షలత మాట్లాడుతూ కళాశాల సిబ్బంది సహకారంతో ఉన్నతమైన విద్యతోపాటు కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మాజీ ప్రిన్సిపాల్ శైలజారాణి, వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి కొనంకి శ్రీధర్, అధ్యాపకులు చక్రవర్తి, సీనియర్ సహాయకులు మహమ్మద్ ఆలీ, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

అట్టహాసంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-నార్పల

వెంకట్ వకుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అట్టహాసంగా ప్రారంభమైంది. టోర్నమెంట్‌ను జిల్లా జైలు సూపరింటెండెంట్ షఫీఉర్ రహమాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. వెంకట్ వకుళ ఫౌండేషన్ చైర్మన్ ఆలం వెంకట్ నరసానాయుడు మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 70 జట్లు పాల్గొనేందుకు నమోదు చేసుకోవడం గర్వకారణమన్నారు. క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షులు ఆలం నాగార్జున నాయుడు, సుల్తాన్‌పేట మహేష్‌నాయుడు తెలుగు యువత నాయకులు చంద్రబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత గుండె వైద్యశిబిరం

యాడికి : మండల కేంద్రంలోని విజన్ హైస్కూల్‌లో పిహెచ్‌ఆర్‌సి, విశాలాక్షి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పిహెచ్‌ఆర్‌సి రాష్ట్ర జనరల్ సెక్రటరీ గుండా నారాయణ స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. యాడికి మండల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కారం

యాడికి : మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీ టివిఎస్ షోరూం పక్కన నెలకొన్న డ్రెయినేజీ సమస్యను టిడిపి నాయకులు శనివారం పరిష్కరించారు. రెండు రోజుల క్రితం డ్రెయినేజీ సమస్యను స్థానికులు టిడిపి నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన తెలుగు యువత నాయకుడు కోడూరు నీలకంఠారెడ్డి, పల్లా పురుషోత్తం, దానినేని నరసింహ చౌదరి దగ్గరుండి కాలువను శుభ్రం చేయించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

యాడికి : అమీనా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నంద్యాల శాంతి రామ్ కంటి ఆసుపత్రి వైద్యులు శనివారం మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా వైద్య నిపుణులు తిప్పేస్వామి సుమారు 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 18 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అమీనా కంటి ఆసుపత్రి యజమాని సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

'ఆర్డీటీ' ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-అనంతపురం

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టుకు సంబంధించిన ఎఫ్‌సిఆర్‌ఎను వెంటనే పునరుద్ధరించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కె.అల్తాఫ్ డిమాండ్ చేశారు. ఆర్డీటీ ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు మద్దతు తెలిపారు. ముందుగా విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి ఎం.సాంబశివుడు, కెఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ కరువు కాలంలో అల్లాడిపోతున్న అనంత జిల్లాను ఆదుకున్న ఆపద్బాంధవుడు విన్సెంట్ ఫెర్రర్ అని గుర్తు చేశారు. ఆయన స్థాపించిన ఆర్డీటీ ద్వారా పేదలకు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. అలాంటి సేవలు ప్రస్తుతం ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించకపోతే ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. కావున వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిస్కవరీ అనంతపురం ఛానల్ అధినేత ఎజి అనిల్‌కుమార్, ఫైట్ ఫర్ రైట్స్ అధ్యక్షులు కెపి రాజు, ఆశ్రయ అనాథాశ్రమం నిర్వాహకులు ఎర్రగుంట కృష్ణారెడ్డి, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు టివి.రెడ్డి, సుబ్బరాయుడు, రామ్‌భూపాల్, విజయభాస్కర్‌రెడ్డి, మస్తానప్ప, ఎస్.పరమేశ్వరరావు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

హరిశ్చంద్ర నాటకం ప్రదర్శన

పామిడి : ప్రభుత్వ సృజనాత్మక తెలుగు భాషా సాంస్కృతిక శాఖ సహాయ సహకారంతో మండలంలోని కట్టకిందపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి పామిడి స్వరరాగ నాటక కళా సమితి ఉచిత శిక్షణాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు దేవరాజు ఆధ్వర్యంలో సత్య హరిశ్చంద్ర రంగస్థలం పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకంలో నరహరి, ఎం.దేవరాజు, నారాయణరెడ్డి, పుంజా కృష్ణారావు, మస్తాన్ వన్నూర ప్ప, అనితాకుమారి, పెనుగొండ నాగవేణి, తదితరులు తమ తమ గాన మాధుర్యంతోపాటు పోటీపడి నటనా చాతుర్యం కనబరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరాణిక నాటక కళలు అంతరించిపోతున్న తరుణంలో నిరుపేద కళాకారులను ఆదుకునే నిమిత్తం తెలుగు నాటక మాసోత్సవం సందర్భంగా ఉచిత రంగస్థల పౌరాణిక నాటకాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కళలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

రాయదుర్గం : ఇండో అమెరికన్ బసవతారకం స్మారక కేన్సర్ ఇన్స్టిట్యూట్ సౌజన్యంతో రాయదుర్గంలోని ఎపి మోడల్ స్కూల్‌లో ఆదివారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు విప్ కాలవ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెఒలిపారు. కేన్సర్ లక్షణాలున్న వారు సుదూర ప్రాంతాలకు వెళ్లి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం ఎన్నో వ్యయ ప్రయాసాలతో కూడుకున్నదన్నారు. ప్రజల సౌకర్యార్థం స్థానికంగానే ఉచిత పరీక్షలు నిర్వహిస్తూన్నామన్నారు. అవసరమైన వారు ఆదివారం ఉదయం 9 గంటలకు కనేకల్లు రోడ్ లోని ఏపీ మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లలో తమ పేర్లు నమోదు చేసుకుని అక్కడే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాయదుర్గం : పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కలశస్థాపన, స్వస్తి వచనం, రక్షాబంధనం వంటి పూజలు నిర్వహించారు. సాయంత్రం నేసే పేటలోని మార్కండేయ స్వామి దేవస్థానంలో ఆలయ కమిటీ పెద్దలు పద్మావతి కన్య నిశ్చితార్థం నిర్వహించారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో అసంబద్ధాలను తొలగించాలి

డిఇఒకు ధర్నా నోటీసు అందజేసిన యుటిఎఫ్

డిఇఒకు నోటీసు అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పాఠశాలల పున:వ్యవస్థీకరణలో ఉన్న అసంబద్ధాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 12న డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య తెలిపారు. ఈమేరకు జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబును యుటిఎఫ్ నాయకులు కలిసి శనివారం ధర్నా నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ప్రాథమిక పాఠశాలలో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అన్ని మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 5 తరగతులు బోధించడానికి 5 గురు టీచర్లను నియమించాలన్నారు. విద్యార్థుల సంఖ్య 75 మించితే పిఎస్ హెచ్‌ఎం పోస్టు అదనంగా కేటాయించాలన్నారు. విద్యార్థుల సంఖ్య 120కి మించితే 6వ ఎస్.జి.టి పోస్టును, ఆ పైన ఉన్న ప్రతి 30 మందికి ఒక ఎస్జీటీ చొప్పున కేటాయించాలని కోరారు. ఉర్దూ మైనర్ మీడియం బోధించే ఉపాధ్యాయులను తెలుగు మీడియం ఎస్జీటీ స్కూల్ అసిస్టెంట్‌లతో కలిపి లెక్కించి పోస్టులు కేటాయించడం సరికాదన్నారు. ఆ పోస్టులు అదనంగా ఇవ్వాలన్నారు. అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించాలన్నారు. ఆయా సమస్యల సాధనకు నిర్వహిస్తున్న ధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, నాయకులు బ్రహ్మానంద, శ్రీనివాసులు, శేషప్ప, రమేష్, ఓబుళపతి, వెంకటనాయుడు, శివరుద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నిక

గుత్తి ప్రభుత్వ ఉద్యోగుల నూతన సంఘం నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

ఎపి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా నూతన కార్యవర్గం ఎన్నికయింది. శనివారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గోపీకృష్ణ బృందం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వహణ అధికారిగా సహ అధ్యక్షులు వేణుగోపాల్, సహాయ ఎన్నికల అధికారిగా కెసి.నాగరాజు వ్యవహరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుత్తి తాలూకా అధ్యక్షులుగా సి.యల్లప్ప, ప్రధాన కార్యదర్శిగా కె.ఆదినారాయణ, అసోసియేట్ అధ్యక్షులుగా వి.ఇమామ్ హుస్సేన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి.నాగరాజు, ఉపాధ్యక్షులుగా బి.లోకేష్,జి.సురేష్ బాబు, కెటి.వెంకట కృష్ణారావు, జె.శివకుమారి, సతీష్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.చంద్ర, ఎస్.రవికుమార్‌రెడ్డి, ఆర్.సంజీవ రాయుడు, నిరీషా, టి.అబ్దుల్ మహరాజ్, వి.రవికుమార్, రమేష్‌బాబు ఎన్నుకున్నారు.

శింగనమల : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి వేణుగోపాల్, సహాయ అధికారి కెసి నాగరాజు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శ్రీరాములు (వైద్య ఆరోగ్యశాఖ), సహాధ్యక్షులుగా పవన్‌కుమార్ (ట్రెజరీ శాఖ), ఉపాధ్యక్షులుగా అశ్వర్థ నారాయణ, (వైద్య ఆరోగ్యశాఖ), సుధాకర్ (వైద్య ఆరోగ్యశాఖ), నారాయణరెడ్డి (ట్రెజరీశాఖ), భాగ్యశ్రీ (సచివాలయ శాఖ), కార్యదర్శిగా శ్రీనివాసులు (విద్యాశాఖ), సహాయక కార్యదర్శులుగా రియాజ్‌బాషా (సచివాలయ శాఖ), సునాలిని (స్త్రీ శిశ సంక్షేమ శాఖ), సుధాకర్ (సచివాలయ శాఖ), మహిళా కార్యనిర్వాహక కార్యదర్శిగా అంజలి (సచివాలయ ఎఎన్ఎం)ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ తాలూకాలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు

వాహనాలదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ రామాంజనేయరెడ్డి

యల్లనూరు : మైనర్ల చేతికి వాహనాలు ఇస్తే శిక్ష తప్పదని ఎస్ఐ రామాంజనేయరెడ్డి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామ సమీప మలుపు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పదేళ్లు లేని పిల్లలు కూడా వాహనాలను నడుపుతున్నారన్నారు. తద్వారా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అంతేగాకుండా పిల్లల భవిష్యత్తు కూడా నాశనం అవుతుందన్నారు. ఇకపై మైనర్లకు వాహనాలు ఇస్తే జైలు కెళ్తాని హెచ్చరించారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాల రికార్డులను ఉంచుకోవాలని కోరారు.

వీరజవానుకు నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

ప్రజాశక్తి-అనంతపురం

యుద్ధంలో వీరమరణం పొందిన సత్యసాయి జిల్లాకు చెందిన మురళీనాయక్‌కు మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అనంతపురం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షా శిబిరంలో మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న, తదితరులు వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం నాయకులు నాగిరెడ్డి, రంగారెడ్డి, బి.రవికుమార్, బండి వెంకటరమణ, ఎం.నరసింహులు, ఎస్.ఖాజామొద్దీన్, బాలనాగరాజు, మహమ్మద్ గౌస్, బిఎ హుస్సేన్, రామ్‌గోపాల్, అబూసలేహ, చిరంజీవి, నంజుండయ్య, దత్తయ్య, సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు

రాయదుర్గం : యుద్ధంలో అమరుడైన జవాన్ మురళీనాయక్‌కు యుటిఎఫ్ నాయకులు శనివారం సాయంత్రం రాయదుర్గంలో నివాళి అర్పించారు. ఇందులో భాగంగా పట్టణంలోని వినాయక కూడలిలో ఫ్లెక్సీ వద్ద కొవ్వొత్తులు వెలిగించి అంజళి ఘటించారు. ఈ కార్యక్రమంలో అనేకమంది యుటిఎఫ్ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

రాయదుర్గం బంజారా ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో యుద్ధవీరుడికి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సేవా సంఘం సభ్యులు రవికుమార్ నాయక్, శివశంకర్ నాయక్, బంజారా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని కోన రోడ్డు ప్రధాన కూడలిలో ఉన్న పీపుల్ హ్యూమన్ రైట్స్ కార్యాలయంలో యుద్ధంలో అమరుడైన తెలుగు వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పించారు. ఇందులో భాగంగా మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. నివాళులర్పించిన వారిలో ప్రజా మానవ హక్కుల కమిటీ స్టేట్ జనరల్ సెక్రటరీ గుండా నారాయణస్వామి, లింగం చంద్రశేఖర్, శివహరి, తిరంపురం నీలకంఠ, చంద్రమౌళి, ఓబులేష్, రామిరెడ్డి, ప్రసాద్, శివకోటి, శివప్రసాద్, కుండా లక్ష్మీనారాయణ తిరుమలేశు, తదితరులు ఉన్నారు.

గుత్తి : దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించి అమర వీరుడైన మురళీనాయక్‌కు గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎండి రఘునాథ్‌రెడ్డి, కరస్పాండెంట్ వికె పద్మావతమ్మ, డైరెక్టర్ వికె శ్రీవాణి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఎఒ ఇంతియాజ్‌బాషా,కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలో వీరజవాన్ మృతికి శనివారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా స్థానిక ఆత్మారాముడు ఆలయం పురవీధుల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో శింగనమల యువత నరసింహ, పాపారాయుడు, మురళి, సాయి, లక్ష్మణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వీర జవాను కుటుంబానికి ఎమ్మెల్యే నెల వేతనం

ఆర్థికసాయం అందజేస్తున్న ధర్మతేజ

కళ్యాణదుర్గం రూరల్ : వీరజవాన్ కుటుంబానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తన నెల వేతనం రూ.1.75 లక్షలను ప్రకటించారు. ఈమరేకు ఆయన మేనల్లుడు దేవినేని ధర్మతేజ శనివారం వీరజవాన్ కుటుంబ సభ్యులను ఓదారి సంబంధిత చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో వీరజవాన్ మురళీనాయక్ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే చెప్పారన్నారు.

సిపిఐ నాయకులు జి.రాముకు నివాళి

గుత్తి : సిపిఐ మండల మాజీ కార్యదర్శి జి.రాము వర్ధంతిని పురస్కరించుకుని శనివారం గుత్తిలోని హంపన్న ఘాట్ ఆవరణలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి జి.రామదాసు, సహాయ కార్యదర్శి రాజుయాదవ్ మాట్లాడుతూ కామ్రేడ్ రాము పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేశారని చెప్పారు. పేదల నివేశన స్థలాల కోసం భూపోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి రమేష్, మహిళా సమాఖ్య కార్యదర్శి మహమ్మద, నాయకులు నజీర్, వెంకటరాముడు, షఫీ, డేనియల్, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన ప్రసాద్, పాత్రికేయుడు గద్దల మస్తానప్ప, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోట అభివృద్ధికి వినతి

గుత్తి : చారిత్రాత్మక కట్టడాలు ఉన్న గుత్తి కోటను అభివృద్ధి చేయాలని గుత్తి కోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి వై.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో నిర్వహించిన గుత్తి కోట సంరక్షణ సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుత్తి కోటను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. రోఫ్ వే ఏర్పాటు చేయాలన్నారు. కోటలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. పర్యాటకుల కోసం కోట వద్ద హరిత హోటల్, పార్కులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి గౌరవ అధ్యక్షుడు పి.వెంకట రామిరెడ్డి, నాయకులు కాశీరావు, సీతారామిరెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి ఆహ్వానం

ఉరవకొండ : మండలంలోని పెన్నఅహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాలకు రావాలని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని ఆహ్వానించారు. ఈమేరకు ఆలయ ముఖ్యకార్య నిర్వహణాధికారి సాకె రమేష్‌బాబు శనివారం ఎమ్మెల్సీ ఇంటికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఈనెల 20వ తేదీ వరకూ నిర్వహించే బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ముఖ్యంగా 17న స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

నేరాలు ఘోరాలు

గడ్డివామి దగ్ధం

పెద్దవడుగూరు : మండలంలోని లక్షుంపల్లికి చెందిన చిన్నసుబ్బయ్య గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు శనివారం నిప్పు పెట్టడంతో దగ్ధమైంది. గ్రామ సమీపంలో చిన్న సుబ్బయ్యకు చెందిన స్థలంలో ఈఏడాది నూతనంగా వ్యయప్రయాసలకు గురై గడ్డివామిని వేసుకున్నారు. అతన్ని ఆర్థికంగా నష్టపరచాలనే ఉద్దేశ్యంతో గడ్డివామికి నిప్పు పెట్టారు. దీంతో మంటలు వ్యాపించి పూర్తిస్థాయిలో వామి దగ్ధం అయింది. గ్రామస్థులు మంటలను ఆర్పేప్రయత్నం చేసినా మంటలు అదుపులోకి రాలేదు. ఈవిషయాన్ని పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి అందించినా ప్రయోజనం లేకపోయిందని గ్రామస్థులు విచారం వ్యక్తంచేశారు. దీంతో సుమారుగా రూ.1.5 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు చిన్నసుబ్బయ్య వాపోయాడు.

చిన్నారిపై కుక్క దాడి

యల్లనూరు : మండల కేంద్రంలో రెండేళ్ల బాలుడిపై శుక్రవారం రాత్రి కుక్క దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండల కేంద్రం పాతపేట రజకవీధిలో నివాసం ఉంటున్న కొప్పేల నాగమ్మ భర్త కొప్పేల గురుస్వామి దంపతుల కుమారుడు రెండేళ్ల గురుప్రజ్వల్ పుట్టుకతోనే అంగవైకల్యం కలిగి ఉన్నాడు. ఈనేపథ్యంలో బాలునికి ఆహారం తినిపిస్తుండగా ఇంటి సమీపంలో ఓ కుక్క ఒక్కసారిగా బాలుడిని నోట కరుచుకుని ఎత్తికెళ్లి గాయపరిచింది. స్థానికులు వెంట పడటంతో బాలుడిని వదిలేసింది. తీవ్రంగా గాపయడిన బాలుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

మొక్కజొన్న పంటకు నిప్పు

బెలుగుప్ప : మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామానికి చెందిన రైతు ప్రతాప్‌రెడ్డికి చెందిన ఐదెకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట కుప్పకు శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో పంట దగ్ధమై దాదాపు రూ.2లక్షలకుపైగా వాటిలిందన్నారు. వెంటనే రైతు ఫైర్ ఇంజిన్‌కు సమాచారం ఇచ్చి మంటలను అదుపు చేశారు.

చాగల్లు రిజర్వాయర్‌లో వ్యక్తి గల్లంతు

శింగనమల : మండల పరిధిలోని ఉల్లికల్లు గ్రామం వద్ద ఉన్న చాగల్లు రిజర్వాయర్ వెనుక జలాల్లో శనివారం వ్యక్తి గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఉల్లికల్లుకు చెందిన శ్రీరాములు (48) గ్రామానికి అనుకుని ఉన్న రిజర్వాయర్ వెనుక జలాల్లోకి దిగాడు. దాదాపు 30 అడుగుల లోతు నీరు ఉండటంతో ఒక్కసారిగా గల్లంతైనట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్లు, బోట్లు తెప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. మృతునికి భార్య భార్య ఓబుళమ్మ, కుమారుడు రాము ఉన్నారు.